# జోరుగా గులాబీ శ్రేణుల ప్రచారం



బల్మూరు: తుమ్మెన్‌పేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

అమ్రాబాద్/బల్మూరు, నవంబర్ 3: మండల కేంద్రంలో అమ్రాబాద్ బీఆర్ఎస్ నాయకులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి ముచ్చటగా మూడో సారి స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాల రాజును అదిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. మరింత అభివృద్ధిపథంలో నడవాలంటే మరో మారు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జావీద్, సయ్యద్, అబ్దుల్లా, గౌస్, మునీర్, సాదిక్, అలీ, సర్దార్, ఖదీర్, జహంగీర్, మల్లేశ్, కిట్టు, శివ, శ్రీను, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపే లక్ష్యంగా బల్మూరు మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తుమ్మెన్‌పేట, బాణాల, గోదల్, బల్మూరు, కొండనాగుల తదితర గ్రామల్లో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజు ఆలయంలో పూజలు చేశారు. అంతకుమందు జినుకుంట కనకాల మైసమ్మ ఆలయంలో మండలస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తుమ్మెన్‌పేటలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ లక్ష్మీవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆంజనేయులు, అంకులయ్య, సురేందర్‌రావు, సర్పంచులు తిరుపతిరావు, శివశంకర్, ఉపసర్పంచులు తిరుపతయ్య, రాజు, నాయకులు గోపాల్‌నాయక్, వెంకటయ్య, తిరుపతయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌రావు, కరుణాకర్ రావు, బాల స్వామి, రాములు, రమేశ్‌నాయక్, ధారసింగ్, మల్లయ్య, వెంకటయ్య, చంద్రమోహన్, బాలస్వామి, గోవర్ధన్, చంద్రయ్య, నాగయ్య, చంద్రమోహన్, రామస్వామిగౌడ్ ఉన్నారు.



అమ్రాబాద్ లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



విప్ గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

వంగూరు, నవంబర్ 3: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతిపక్షాలు బీఆర్ఎస్‌లో చేరుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన 12 మంది బీజేపీ కార్యకర్తలు కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ సారథ్యంలో శుక్రవారం విప్ గువ్వల బాల్‌రాజ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు వేసి ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విప్ గువ్వల మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అచ్చంపేట గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలతో వారు బీఆర్ఎస్‌తోనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రేణయ్యగౌడ్ పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే



అన్నారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వంగూరు, నవంబర్ 3: మండలంలోని అన్నారంలో శుక్రవారం బీఆర్ఎస్ నేత, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లాలుయాదవ్ గ్రామ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా లాలు యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ రూ.400 ఇవ్వడంతో పాటు అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కారుకు ఓటేసి ప్రభుత్వ విప్ గువ్వల బాల్‌రాజ్‌ను మరో సారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, కాశిరెడ్డి, కాశన్న పలువురు ఉన్నారు.

## మూడోసారి అధికారం బీఆర్ఎస్‌కే..

ఉప్పునుంతల, నవంబర్ 3: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి ముచ్చటగా మూడో సారిఅచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రం ఉప్పునుంతల, మర్రిపల్లి, తాడూర్, పెనిమిళ్ల, కంసానిపల్లి , రాయిచెడ్, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. అదే విధంగా తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు రాదని, సంక్షేమ ఫలాలు అందవన్నారు. అభివృద్ధి కోసం పనిచేసే బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని, నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్న ప్రభుత్వ విప్ గువ్వల బాల రాజును ముచ్చటగా మూడో సారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, సంబు భాస్కర్, వెంకటయ్య, కొట్టె శ్రీను, బయ్య శ్రీను, తిర్పతయ్య, మురళి, ఎల్లయ్య యాదవ్, శ్రీను, గణేశ్, రాజు, చిన్నజంగయ్య, గోపాల్, లింగస్వామి, కృష్ణయ్య, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గులాబీ శ్రేణులు

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అచ్చంపేట టౌన్, నవంబర్ 3: అచ్చంపేట పట్టణంలో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతుంది. పట్టణంలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్‌తో పాటు కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో పాల్గొని, ప్రతి ఓటరుకు సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో గురించి ఓటర్లకు వివరించారు. అనంతరం కాలనీల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, గత పాలకుల హయాంలో రోడ్లపై అవస్థల గురించి మాట్లాడారు. మురికి నీరు రోడ్డుపై పారుతూ కాలనీవాసులు అనారోగ్యం పాలయ్యారని, దవాఖానకు వెళితే కనీస సదుపాయాలు ఉండేవి కాదని, సుదూర ప్రాంతాలకు వెళ్లే వారమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు చొరవతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి తెచ్చి అచ్చంపేట పట్టణంలో వంద పడకల దవాఖాన నిర్మించారన్నారు. అభివృద్ధి చేసే పార్టీకి బాసటగా నిలవాలని ఓటర్లను కోరారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గువ్వల బాలరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మన్నుపటేల్, కాలనీవాసులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల గెజిట్ ప్రదర్శన



నోటీస్ బోర్డుపై గెజిట్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

అచ్చంపేట టౌన్, నవంబర్ 3: మొదటి రోజు ఎన్నికల గెజిట్‌ను ప్రదర్శించినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గోపిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గం 82కు శుక్రవారం మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు. ఉదయం 11గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ గెజిట్‌ను రిటర్నింగ్ అధికారి కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించారని తెలిపారు. అనంతరం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నేనావత్ రాములునాయక్, సిబ్బంది ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

అమ్రాబాద్, నవంబర్ 3: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పదర మండలంలోని మద్దిమడుగు, మారడుగు, ఇప్పలపల్లి, ఉడిమిల్ల గ్రామాల్లో 231 నుంచి 235 వరకు ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను స్థానిక పంచాయతీ కార్యదర్శులతో కలిసి డీఎల్పీవో వెంకటయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ సమయంలో చేపట్టాల్సిన వసతుల గురించి విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మంచినీరు, మరుగుదొడ్డి తదితర సౌకర్యాలను ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటుచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో గ్రామంలో కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు గోపి, మాత్రు, అశోక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

లింగాల, నవంబర్ 3: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మంగ్దాం పుల్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని దృష్టిలో పెట్టుకొని నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలలో అనుమతులు లేకుండా రూ.లక్షకు పైబడి డబ్బులు తీసుకెళ్లరాదన్నారు. అలాగే డబ్బులతో పాటు మద్యం, బంగారం తదితర వస్తువులను మోతాదుకు మించి వెంట తీసుకెళ్లవద్దని అన్నారు. ఎలాంటి సంఘటనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపై దాడి: కొడుకుపై కేసు నమోదు

తిమ్మాజిపేట, నవంబర్ 3 : ఆస్తి గొడవలు కారణంగా తల్లిపై దాడి చేసిన ఘటన పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చంద్రమ్మకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ఇటీవలే పెద్దకుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చిన చంద్రమ్మను గురువారం కుమారుడు కర్రతో దాడి చేయడంతో పాటు, ఇంట్లో నుంచి ఈడ్చి బయట పడేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు దవాఖానలో చికిత్స చేయించుకుని వచ్చిన చంద్రమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబర్ 3 : హైదరాబాద్‌లో నవంబర్ 5న నిర్వహించనున్న విశ్వకర్మ మహాజన బహిరంగసభను విజయవంతం చేయాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి శుక్రవారం ప్రకటనలో కోరారు. విశ్వబ్రాహ్మణుల పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్నట్లు విశ్వ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## సౌకర్యాల పరిశీలన

తిమ్మాజిపేట, నవంబర్ 3 : మండలంలో పుల్లగిరి, బండమీదితండా పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో కరుణశ్రీ శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యం, ర్యాంపు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలపై ఆరా తీశారు.

## నేడు కిసాన్ మేళా

బిజినేపల్లి, నవంబర్ 3: మండలంలోని పాలెం కృషివిజ్ఞాన కేంద్రంలో నేడు కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పంటలపై అవగాహన, వ్యవసాయ యంత్రాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.